సాక్షి
చిత్తూరు

ఆదివారం । 20 । జూలై । 2025



నీచపు వ్యాఖ్యలు ఖండిస్తూ..

నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ నీచపు వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకురాళ్లు మండిపడ్డారు. - 8లో



స్వచ్ఛత.. అందరి బాధ్యత

స్వచ్ఛత అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ పాటించాలని చిత్తూరు ఏఆర్ ఏఎస్పీ శివానందకిశోర్ పేర్కొన్నారు. - 8లో



టెంపో డ్రైవర్ మృతి

శాంతిపురంలో ఆగి ఉన్న లారీని మరో టెంపో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టెంపో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. - 8లో

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీలో నియామకాలు



దయాసాగర్‌రెడ్డి, కృష్ణమూర్తి, వెంకట్‌రెడ్డియాదవ్

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులుగా(పార్లమెంటు) చిత్తూరుకు చెందిన పలువురిని నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. నియమితులైన వారిలో ఎం.దయాసాగర్‌రెడ్డి, ఎం.కృష్ణమూర్తి, ఎస్.వెంకట్‌రెడ్డియాదవ్ ఉన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలను వీరికి కేటాయించారు. వీరు పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ, సంబంధిత రీజనల్ కో–ఆర్డినేటర్లు, పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులకు సహాయకారిగా వ్యవహరించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లోనే మెరుగైన వైద్యం



గర్భిణులకు సూచనలందిస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి

పూతలపట్టు(యాదమరి): ప్రభుత్వాస్పత్రుల్లోనే గర్భిణులకు మెరుగైన వైద్యం అందుతుందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ హనుమంతరావు చెప్పారు. శనివారం ఆయన పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని బందార్లపల్లిలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య చికిత్సలు చేసుకోవాలన్నారు. సకాలంలో మందులు, టీకాలు వేసుకోవడం వల్ల తల్లితో పాటు గర్భస్థ శిశువు కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. కాన్పునకు ప్రభుత్వాస్పత్రికే వెళ్లాలని చెప్పారు. అనంతరం గర్భిణులను పరీక్షించి వారికి అవసరమైన మందులను అందజేశారు. సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూలైన్ శిలాతోరణం వరకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 73,093 మంది స్వామిని దర్శించుకున్నారు. 31,570 మంది భక్తులు తలనీలాలు ఇచ్చారు. దర్శన టిక్కెట్లు లేని వారికి 24 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

జగన్ విజన్ భళా!

'ఆధ్యాత్మిక నగరం పరిశుభ్రంగా ఉండాలి.. తిరునగరి ఖ్యాతి దశదిశలా ఇనుమడించాలి.. స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో ఆధిపత్యాన్ని చాటాలి.. జాతీయ స్థాయిలో తిరుపతి పరపతి మరింత పెరగాలి.. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను వంద శాతం అమలుచేయాలి.. తద్వారా రెడ్యూస్.. రీయూస్.. రీసైకిల్ విధానాన్ని పక్కాగా అమలు చేసి స్వచ్ఛ మహా యజ్ఞంలో తిరుగులేని శక్తిగా ఆవిష్కరించాలి..' అన్న సంకల్పంతో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో తూకివాకంలోని ఇంటిగ్రేటెడ్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను అభివృద్ధి చేశారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం సీఎం చంద్రబాబు ఆ ప్లాంటును సందర్శించి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్లాంట్ నిర్మాణాలపై ఆరా తీశారు. అప్పటి సీఎం జగన్ విజనరీని మెచ్చుకున్నారు. చప్పట్లు కొట్టి అభినందించారు.

- ఇంటిగ్రేటెడ్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ చూసి ఆశ్చర్యం వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు
- ప్రైవేట్ పబ్లిక్ పార్టనర్‌షిప్ పద్ధతిలో గత ప్రభుత్వం గ్రీన్‌సిటీ అభివృద్ధి
- దేశంలో ఎక్కడా లేని విధంగా చెత్త నుంచి సంపద తయారీ
- ప్రాజెక్టుల ఏర్పాటుపై ఆరా తీసిన ముఖ్యమంత్రి




తూకివాకం వద్ద వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అభివృద్ధి చేసిన ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్

తిరుపతిలో ఉత్పత్తయ్యే చెత్త	210 టన్నులు
తడి చెత్త	90 టన్నులు
పొడి చెత్త	120 టన్నులు
శానిటేషన్ నిర్వహిస్తున్న సిబ్బంది	920 మంది

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో సాధించిన ర్యాంకులు

సంవత్సరం	సాధించిన ర్యాంక్
2017	9
2018	6
2019	8
2020	6
2021	రద్దు
2022	1 (ప్రెసిడెంట్ అవార్డు)
2023	1
2024	రద్దు
2025	సూపర్ స్వచ్ఛ లీగ్ అవార్డు



మురుగు నీటి శుద్ధి కేంద్రం



డ్రైవేస్ట్ ప్లాంట్‌లో వ్యర్థాల విభజన

తిరుపతి తుడా : నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను గత ప్రభుత్వం అనుసరించి రాష్ట్ర వ్యాప్తంగా ఆయా నగరాల్లో ఉత్పత్తయ్యే చెత్తను వంద శాతం సద్వినియోగం చేసేందుకు చర్యలు చేపట్టింది. దీన్ని మహా యజ్ఞంగా భావించి రెడ్యూజ్, రీయూజ్, రీసైకిల్ విధానాన్ని అమలుచేసింది. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా చెత్త నిర్వహణను పక్కాగా అమలుచేసి దేశం తిరుపతి వైపు చూసేలా చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే స్వచ్ఛ సర్వేక్షణ్ అమలుచేస్తున్న నగరాల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణలో తిరుపతి అగ్రస్థానంగా నిలిచింది. అప్పటి అధికారులు చిత్తశుద్ధితో పీపీపీ పద్ధతిలో ప్లాంటును యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి అమల్లోకి తీసుకొచ్చారు. చెత్త ద్వారా సంపదను సృష్టించే విధానం తిరుపతి నుంచే మొదలైంది.

తూకివాకం గ్రీన్‌సిటీలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రాజెక్టులు



ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ పనితీరును పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

2019లో బయో మెథనైజేషన్ ప్లాంటును మహేంద్ర అండ్ మహేంద్ర కంపెనీతో తిరుపతి నగర పాలక సంస్థ ఎంఓయూ (ఒప్పందం) కుదుర్చుకుంది. తిరుపతి నగరంలో ఉత్పత్తి అయ్యే తడి చెత్త, ఫుడ్ వేస్ట్ ద్వారా గ్యాస్‌ను ఉత్పత్తి చేసి విక్రయించుకునేందుకు అనుమతించారు. మున్సిపల్ కార్పొరేషన్ తూకివాకంలో రెండెకరాల స్థలాన్ని మాత్రమే ఆ కంపెనీకి అప్పగించింది. రూ.18 కోట్లు వెచ్చించి బయో మెథనైజేషన్ ప్లాంటును అభివృద్ధి చేసి నగరంలో ఉత్పత్తయ్యే తడి చెత్తను పూర్తి స్థాయిలో ఎరువులుగా తయారుచేస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్లాంట్‌ను బ్లూ ప్లానెట్ సంస్థ నిర్వహిస్తోంది.

వ్యర్థ నీటి శుద్ధిలో రెండవ నగరం

తిరుపతి నగరంలో వెలువడే డ్రైనేజీ వ్యర్థాలను శుద్ధి చేసే కేంద్రం 1980లో ప్రారంభించారు. 50 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో ఈ ప్రాజెక్టును స్వయంగా మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహిస్తోంది. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యర్థాలు సామర్థ్యానికి మించి వెలువడుతోంది. 2020లో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా వాటర్ ప్లస్ విధానానికి శ్రీకారం చుట్టారు. స్మార్ట్ సిటీ నిధుల నుంచి రూ.32 కోట్లు వెచ్చించి 25 ఎమ్ఎల్డీ నీటి శుద్ధి కేంద్రాన్ని రెండేళ్ల పాటు శ్రమించి అభివృద్ధి చేశారు. ఆధునిక టెక్నాలజీతో మురుగు నీటి శుద్ధి కేంద్రాన్ని అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ శుద్ధి చేసిన నీటిని ప్రైవేటు కంపెనీలకు విక్రయించడంతో పాటు చుట్టు పక్కల రైతులకు ఉచితంగా సరఫరా చేస్తున్నారు. ఇలా చెత్తను 100 శాతం రిలీజ్ చేసేందుకు నాటి ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో పనిచేసింది.

2021లోనే చెత్త నుంచి సంపద

పొడి చెత్త నుంచి సంపద సృష్టించే దిశగా తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ 2021లో అడుగులు వేసింది. ప్రతి కిలో పొడి చెత్త నుంచి రూ.2 ఆదాయాన్ని పొందుతున్న నగరంగా తిరుపతి దేశంలో తొలి సిటీగా నిలిచింది. నెలకు రూ.10 లక్షల మేర ఆదాయం లభిస్తోంది.

ఎరువుల తయారీ

నగరంలో ఉత్పత్తి అయ్యే వెట్ వేస్ట్ ద్వారా సేంద్రియ ఎరువుల తయారీకి 2020లో శ్రీకారం చుట్టారు. తడి చెత్త నిర్వహణను ఎన్జీఓ సంస్థకు అప్పగించారు. డీ కంపోజర్ చేసి తద్వారా ఎరువులు తయారు చేసి రైతులకు నామ మాత్రపు ధరలతో విక్రయించే విధానం తిరుపతి నుంచే మొదలైంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు నిర్వహణ ఆగిపోయింది.

సిమెంటు ఇటుకల తయారీ

సీ అండ్ డీ (కన్‌స్ట్రక్షన్ అండ్ డెమోలిష్) ప్రాజెక్టును పీపీపీ పద్ధతి ద్వారా ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. 2020లో రూ.14 కోట్లు ఖర్చుచేసి భవన వ్యర్థాల ద్వారా సెగ్రిగేషన్ ప్రక్రియను ప్రారంభించారు. భవన వ్యర్థాల్లోని ఇసుక, కంకర, ఐరన్‌ను వేరు చేయడం, తద్వారా వెలువడిన ఇసుక సన్నని కంకర ద్వారా ఫుట్ పాత్‌కు ఉపయోగించే సిమెంట్ ఇటుకల తయారీ రోడ్ల నిర్మాణంలో ఉపయోగించుకునేందుకు అవసరమైన మెటీరియల్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. నగరంలో వెలువడే భవన వ్యర్థాలను 100 శాతం సెగ్రిగేషన్(విభజన) చేయాలనే సంకల్పంతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు.

ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు ఆరా

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉత్పత్తయ్యే చెత్తను రెడ్యూస్, రీయూస్ రీసైక్లింగ్ చేస్తున్న విధానంపై సీఎం చంద్రబాబు సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ ప్రాజెక్టులు ఎప్పుడు కట్టారు? ఎంత ఖర్చు చేశారు? అని ఆరా తీశారు. ఈ ప్రాజెక్టులను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధిచేశారని చెప్పడంతో ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇంత అభివృద్ధి గురించి తనకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని వాకబు చేశారు. ప్లాంట్ల నిర్వహణ బాగుందని ప్రశంసించారు. బయో మెథనైజేషన్ ప్లాంటుకు చంద్రబాబు 2018లో ఎంఓయూ కుదుర్చుకుని ఆపై విస్మరించారు. తిరిగి 2019లో మహేంద్ర కంపెనీతో ఒప్పందం కుదిరి ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయించేందుకు నాటి పాలకులు, అధికారులు ఎంతో శ్రమించారు. మిగిలిన ప్రాజెక్టులను 2019–24 మధ్య ప్రారంభించి అందుబాటులోకి తీసుకొచ్చారు. వీటిపై ఆరా తీసి వ్యర్థాల నిర్వహణపై సీఎం సంతృప్తి వ్యక్తంచేసి అధికారులను అభినందించారు.

ఏపీపీఎస్సీ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు



మాట్లాడుతున్న డీఆర్‌వో మోహన్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఆదివారం జరగనున్న ఏపీపీఎస్సీ లెక్చరర్ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టినట్టు డీఆర్‌వో మోహన్‌కుమార్ తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణకు శనివారం కలెక్టరేట్‌లో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. డీఆర్‌వో మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఏపీపీఎస్సీ లెక్చరర్ పరీక్షకు మొత్తం 660 మంది హాజరుకానున్నట్టు తెలిపారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు మధ్యాహ్నం 1.30 గంటలకు చేరుకోవాలన్నారు. జిల్లాలోని సీతమ్స్, ఎస్వీ సెట్, పలమనేరులోని మదర్ థెరిస్సా, పూతలపట్టు మండలంలోని వేము ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్షలు ఉంటాయన్నారు.

ఏనుగుల బీభత్సం



మర్రికుంటవారిపల్లెలో మామిడి కొమ్మలను విరిచేసిన ఏనుగులు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని దేవళంపేట పంచాయతీలో శనివారం తెల్లవారు జామున దాదాపు 14 ఏనుగుల గుంపు పంట పొలాలపై పడి బీభత్సం సృష్టించింది. పగటి పూట సమీపంలోని చింతలవంకలోని అటవీ ప్రాంతంలో ఉంటూ రాత్రి సమయంలో సమీప పంట పొలాలపై దాడి చేస్తున్నాయి. మర్రికుంటవారిపల్లెకు చెందిన చలం మామిడి తోపు చుట్టూ నాటిన కూసాలను తొక్కి విరిచేశాయి. అలాగే చంద్రమోహన్ మామిడి తోటలో మామిడి కొమ్మలను, బాబుకు చెందిన వంకాయ సాగును ధ్వంసం చేశాయి.

మిథున్‌రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికం

- ఎంపీ అరెస్ట్‌పై పెల్లుబికిన నిరసన
- మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబాన్ని టార్గెట్ చేయడం దుర్మార్గం
- కూటమి ప్రభుత్వం జనాగ్రహానికి గురికాక తప్పదు

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌పై చిత్తూరు, తిరుపతి జిల్లాల ప్రజలు మండిపడుతున్నారు. లిక్కర్ స్కామ్ కేసులో ఆయన్ను శనివారం రాత్రి సిట్ అధికారులు అరెస్ట్ చేయడంపై ధ్వజమెత్తుతున్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబాన్ని అణగదొక్కడానికే మిథున్‌రెడ్డిని విరికించారని విరుచుకుపడుతున్నారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని చూసి కూటమి ప్రభుత్వం వణికి పోతోందని తెలిపారు. అందుకనే అక్రమ కేసులు బనాయించి, లిక్కర్ స్కామ్ కేసులో విరికించి భయపెట్టాలని చూస్తోందని ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా న్యాయం గెలిచి తీరుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని స్పష్టం చేశారు.

– పుంగనూరు / పలమనేరు / కాణిపాకం

ఎంపీ అరెస్ట్ కక్ష పూరితం



ఈ రాష్ట్ర ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది. రాష్ట్ర ప్రజలను భయపెట్టాలని చూస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో దాడులు ఎక్కువయ్యాయి. అరాచకాలకు పాల్పడుతోంది. అవినీతి, అక్రమాలు తారస్థాయికి చేరుకున్నాయి. వీటిని ప్రశ్నించే గొంతు నొక్కేస్తోంది. అడ్డొచ్చే ప్రతిఒక్కర్నీ అణగదొక్కుతోంది. కుట్ర పూరితంగా తప్పుడు కేసులు బనాయిస్తోంది. ఇప్పటికే వైఎస్సార్‌సీపీకి చెందిన పలువురు నేతలను అరెస్ట్ చేయగా..రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిని కూడా అరెస్ట్ చేసింది. ఇది ముమ్మాటికీ దారుణం. పగబట్టి ప్రతీకారం తీర్చుకుంది. ఈ ప్రభుత్వం ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా వైఎస్సార్‌సీపీని, మిథున్‌రెడ్డి ఏం చేయలేరు. మిథున్‌రెడ్డి అరెస్టును మేము తీవ్రంగా ఖండిస్తున్నాం.

– సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే, పూతలపట్టు

అక్కసుతోనే అక్రమ అరెస్ట్



ఎంపీ మిథున్‌రెడ్డిపై అక్కసుతోనే లిక్కర్ కేసు నమోదు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే తీవ్ర ప్రజావ్యతిరేకత ఏర్పడింది. అదే సమయంలో వైఎస్సార్ సీపీకి విశేష ఆదరణ లభిస్తోంది. దీన్ని చూసి కూటమి నేతలు తట్టుకోలేక పోతున్నారు. ఈ క్రమంలో లిక్కర్ కేసులో ఇరికించారు. ఏడు కేసుల్లో బెయిల్‌పై ఉన్న చంద్రబాబు వరుసబెట్టి వైఎస్సార్ సీపీ నాయకులపై కేసులు పెట్టిస్తున్నారు. ఇలాంటి తప్పుడు కేసులకు వైఎస్సార్ సీపీ నాయకులు భయపడే ప్రసక్తేలేదు.


– పవిత్ర, వైఎస్సార్‌సీపీ విశ్వబ్రాహ్మణ విభాగం అధ్యక్షురాలు, బైరెడ్డిపల్లి క్రిష్ణమూర్తి, మురళీకృష్ణ, రాష్ట్ర కార్యదర్శులు

ప్రజలకు సేవ చేయడం నేరమా?



నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవ చేయడమే పెద్దిరెడ్డి కుటుంబం చేసిన నేరమా..?. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి పై తప్పుడు కేసులు బనాయించి అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నాం. ఇలా తప్పుడు కేసులు బనాయించే వారికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారు. –మాగడి సల్మా, హ్యూమన్ రైట్స్ జిల్లా ఉపాధ్యక్షురాలు, పుంగనూరు


తిరుగుబాటు తప్పదు



రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిపై తప్పుడు కేసులు బనాయించి అరెస్ట్ చేయడం అక్రమం. తప్పుడు కేసులు పెట్టి పెద్దిరెడ్డి కుటుంబాన్ని అణచి వేయలేరు. పెద్దిరెడ్డి కుటుంబంపై కేసులు బనాయిస్తే తిరుగుబాటు ఉద్యమం తప్పదు.

– కిషోర్, వ్యాపారి, పుంగనూరు


బాధాకరం



పెద్దిరెడ్డి కుటుంబం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను, ఆయనకున్న ప్రజాభిమానాన్ని చూసి సహించలేక పోతున్నారు. అందుకనే ఎంపీ మిథున్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేశారు. ఇది చాలా బాధాకరం. ప్రజా సేవ చేసే వారిని ఇలాంటి కేసులు ఏమీ చేయలేవు.

– ఆసిఫ్, మైనార్టీ యువకుడు

కేసులు కాదు...అభివృద్ధి చేయండి



పుంగనూరు నియోజకవర్గాన్ని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఎంతో అభివృద్ధి చేశారు. ప్రభుత్వానికి చేతనైతే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయాలే తప్ప.. ఇలా అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయడం ఎంతవరకు కరెక్ట్.

– యాసిన్, మైనార్టీ యువకుడు, పుంగనూరు

పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఢీకొనలేక..



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన తనయుడు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి ముగ్గురూ ఎన్నికల్లో గెలవడంపై కూటమి ప్రభుత్వం జీర్ణించుకోలేక పోయింది. ఎలాగైనా పెద్దిరెడ్డి ఆధిపత్యాన్ని తగ్గించేందుకు మిథున్ రెడ్డిపై తప్పుడు కేసులు బనాయించించింది. దీనికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందే.

– అజీజ్‌సాహెబ్, ముతవల్లి, పుంగనూరు

అధికార మదంతో అణచివేస్తారా?



పెద్దిరెడ్డి కుటుంబం ఎదుగుదలను చూసి ఓర్వలేక పోతున్నారు. అందుకనే అధికార మదంతో అణచివేయడానికి ఒడిగట్టుకున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా పెద్దిరెడ్డి కుటుంబాన్ని ప్రజల నుంచి విడదీయలేరు. తప్పుడు కేసులు బనాయిస్తే కూటమి ప్రభుత్వం జనాగ్రహానికి గురికాక తప్పదు. అక్రమ కేసులు ఆపండి.

– పి.అయూబ్‌ఖాన్, రైతు, పుంగనూరు

ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దండి



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా స్వచ్ఛత, ప్లాస్టిక్ నిర్మూలన పై అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ మానవాళి మనుగడకు ప్లాస్టిక్ ఎంతో ప్రమాదకరమన్నారు. ప్లాస్టిక్‌ను నిర్మూలించడం ఎంతో ముఖ్యమన్నారు. స్టీల్ వాటర్ బాటిల్స్ వినియోగంపై పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేసి కలెక్టరేట్ ప్రాంగణంలోని పరిసరాలను శుభ్రం చేశారు. డీఆర్‌వో మోహన్‌కుమార్, ఏవో వాసుదేవన్ పాల్గొన్నారు.

వద్దురా కన్నా... ఇది హైవేరా చిన్నా!



మొదలే చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి. వాహనాలు రయ్..రయ్ మంటూ దూసుకుపోతుంటాయి. ఈ హైవేలో శనివారం అంతంతమాత్రం డ్రైవింగ్ అనుభవమున్న ఓ బాలుడు మరో ముగ్గురిని బైక్‌లో ఎక్కించుకుని ప్రయాణించడం కనిపించింది. నంబర్ ప్లేట్ కూడా లేని ఈ ద్విచక్ర వాహనంలో నలుగురు వెళ్లడం చూపరులను గగుర్పొడిచింది.

– గుడిపాల

క్లుప్తంగా

బొలెరో బోల్తా



బొల్తా కొట్టిన బొలెరో వాహనం

చౌడేపల్లె : చౌడేపల్లె–పలమనేరు మార్గంలోని చిట్రెడ్డిపల్లె సమీపంలో అదుపుతప్పి టమాట లోడ్‌తో వెళ్తున్న బొలెరో వాహనం బోల్తా పడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పరికిదొన నుంచి పలమనేరు మార్కెట్‌కు టమాట కాయల బాక్సులను నింపి బొలెరోలో తరలిస్తుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి వాహనం రోడ్డు పక్కకు బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.70 వేల విలువ చేసే టమాట కాయలు నుజ్జునుజ్జయ్యాయి. ధరలు ఆశాజనకంగా ఉన్న సమయంలో ప్రమాదం జరిగి నష్టం వాటిల్లడంతో రైతు బోరున విలపించాడు. ఈ ఘటనలో డ్రైవర్‌తోపాటు మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. కాగా వారి వివరాలు తెలియ రాలేదు.

విద్యార్థులపై దాడి – కేసు నమోదు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతున్న విద్యార్థులపై దాడి చేసిన కేసులో ముగ్గురు నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు. టూటౌన్ సీఐ నెట్టికంటయ్య కథనం మేరకు.. గతవారం నాయుడు బిల్డింగ్స్ వద్ద ఓ ప్రైవేటు కళాశాలకు చెందిన విద్యార్థులు రెండు గ్రూపులుగా విడిపోయి రోడ్లపైనే బాహాబాహీకి దిగారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు ఆ రెండు గ్రూపులను స్టేషన్‌కు పిలిపించి హెచ్చరించి పంపించేశారు. అయితే శుక్రవారం ఓబనపల్లెకు చెందిన హేమంత్‌కుమార్, ధనుష్ అనే విద్యార్థులపై శంకరయ్య గుంటకు చెందిన సతీష్, హర్షద్, వసంత్ అనే ముగ్గురూ దాడికి పాల్పడ్డారు. బాధితుల కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పకడ్బందీగా డెంగ్యూ మాసోత్సవాలు

తవణంపల్లె: డెంగ్యూ మాసోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి డాక్టర్ జి.వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం తవణంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. వైద్యాధికారులు డాక్టర్ మోహన్‌వేలు, డాక్టర్ కేశవనారాయణ సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, పీహెచ్‌ఎన్ జీవకళ, ఆరోగ్య పర్యవేక్షకులు రాజశేఖర్, రాజామణి, రెడ్డెమ్మ, నిర్మలమ్మ, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యంరెడ్డి, శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్‌గ్రేడేషన్ పనులు వేగవంతం

చిత్తూరు కలెక్టరేట్ : కుప్పం నియోజకవర్గంలోని 35 మోడల్ స్కూల్స్ అప్‌గ్రేడేషన్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ సిబ్బందిని ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలోని 35 మోడల్ స్కూల్స్‌లో పనులను 100 రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. కుప్పం నియోజకవర్గంలో 35 ప్రాథమిక పాఠశాలలను మోడల్ స్కూల్స్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వం అనుమతిచ్చిందన్నారు. అప్‌లోడ్ అయిన ప్రతి బిల్లుకు నగదు చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. డీఈవో వరలక్ష్మి, ఏపీసీ వెంకటరమణ, ఈఈ మదుసూదన్‌రావు పాల్గొన్నారు.

నీచపు వ్యాఖ్యలు ఖండిస్తూ నిరసన



క్యాండిళ్లతో నిరసన వ్యక్తం చేస్తున్న పార్టీ శ్రేణులు



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తూ..

నగరి : మహిళను కించపరచడం దేశ సంస్కృతిని కించపరచడమే అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా నేతలు పేర్కొన్నారు. మాజీ మంత్రి ఆర్కే రోజానుద్దేశించి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చేసిన నీచపు వాఖ్యలను ఖండిస్తూ వారు శనివారం దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహం వద్దకు వెళ్లి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళా నాయకురాళ్లు మాట్లాడుతూ మాజీ మంత్రి ఆర్కే రోజాపై టీడీపీ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చేసిన వ్యాఖ్యలు అత్యంత హేయమన్నారు. దుష్ట సంస్కృతికి ఈ వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయన్నారు. మహిళను గౌరవించడం అన్నది భారత దేశ సంస్కృతి అన్నారు. అలాంటిది రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఒక సారి మంత్రిగా, నటిగా ఉన్న ఆర్కే రోజా లాంటి మహిళకే గౌరవం లేకుంటే ఇక సాధారణ మహిళల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తక్షణం ఎమ్మెల్యే భానుపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ మహిళా అధ్యక్షులు అముద, మున్సిపల్ మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, కౌన్సిలర్లు చినపాప, సాయి సంధ్యారాణి, మున్సిపల్ మహిళా కార్యదర్శి తేన్‌మొళి, రూరల్ మండల మహిళా అధ్యక్షురాలు మాబూనిషా, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, పట్టణ పార్టీ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, రూరల్ పార్టీ అధ్యక్షులు తిరుమలరెడ్డి, నేతవిభాగం అధ్యక్షులు బాలకృష్ణ, కన్నాయిరం, వైస్‌చైర్మన్ బాలన్, వైస్ ఎంపీపీ కన్నియప్ప, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, పార్టీ కమిటీల సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టెంపో డ్రైవర్ మృతి



మృతి చెందిన డ్రైవర్ వెంకటేష్

శాంతిపురం: ఆగి ఉన్న లారీని మరో టెంపో ఢీకొన్న ఘటనలో సత్యసాయి జిల్లాకు చెందిన టెంపో డ్రైవర్ మృతి చెందగా క్లీనర్ తీవ్రంగా గాయపడ్డాడు. కుప్పం – పలమనేరు జాతీయ రహదారిలో కడపల్లి వద్ద మరమ్మతులకు గురైన ఓ లారీ శనివారం రోడ్డు పక్కన ఆగిపోయింది. సత్యసాయి జిల్లా కదిరి ప్రాంతం నుంచి మామిడి కాయలతో సేలం వైపునకు వెళ్తున్న టెంపో ఎదురుగా వచ్చి ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో తనకల్లు మండలానికి చెందిన లారీ డ్రైవర్ వెంకటేష్(23) అక్కడికక్కడే మృతి చెందాడు. టెంపోలోని క్లీనర్ వెంకటాద్రి (22) తీవ్రంగా గాయపడ్డాడు. 108కు సమాచారం ఇవ్వడంతో వెంటనే అక్కడికి చేరుకుని మృతుడిని, క్లీనర్‌ను టెంపో నుంచి కిందికి దింపారు. తీవ్రంగా గాయపడ్డ క్లీనర్ వెంకటాద్రిని పీఈఎస్ ఆస్పత్రిలో చేర్పించారు. డ్రైవర్ వెంకటేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. ఈ ప్రమాదంపై రాళ్లబూదుగూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాస్టిక్ నిషేధమే లక్ష్యం



తవణంపల్లె హైస్కూల్లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న డ్వామా పీడీ రవికుమార్

తవణంపల్లె: ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలని డ్వామా పీడీ రవికుమార్ పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్రా– స్వర్ణాంధ్రా కార్యక్రమంలో భాగంగా పీడీ రవికుమార్ శనివారం తవణంపల్లె హైస్కూల్లో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ నిర్మూలన దిశగా ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, మండల వ్యవసాయాధికారి ప్రవీణ్, తవణంపల్లె హైస్కూల్ హెచ్‌ఎం వేణుగోపాల్ రెడ్డి, ఎగువతవణంపల్లె సర్పంచ్ చిట్టెమ్మ, ఏపీడీ బీ.సుబ్రమణ్యం, ఏపీఓ బాల, ఈసీ రమ్య, ప్లాన్‌టేషన్ సూపర్‌వైజర్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛత..అందరి బాధ్యత



ప్లాస్టిక్ బాటిళ్ల సేకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్, సీఐ

చిత్తూరు అర్బన్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతోనే మానవాళికి మేలు జరుగుతుందని పోలీసు శాఖ ఏఆర్ ఏఎస్పీ శివానందకిషోర్ తెలిపారు. స్వచ్ఛ ఆంధ్రా – స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా శనివారం చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు, ఏఆర్ కార్యాలయం, మిట్టూరు వద్ద ఉన్న పోలీసు ఆస్పత్రి ప్రాంగణాల్లో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, మహబూబ్ బాషా, ఆర్‌ఐ సుధాకర్ ల్గొన్నారు.

మున్సిపల్ కార్పొరేషన్ కార్యాయంలో..

చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పక్కన ఉపయోగించి పారేస్తు న్న ప్లాస్టిక్ బాటిళ్ల సేకరణ కేంద్రాన్ని కమిషనర్ నరసింహ, వన్‌టౌన్ సీఐ మహేశ్వర ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ వాటర్ బాటిళ్లు, కూల్‌డ్రింక్ బాటిళ్లను కాలువల్లో పడేస్తుండడం వల్ల మురుగు ముందుకు వెళ్లకుండాపోతోందన్నారు. ప్లాస్టిక్ బాటిళ్ల జోన్‌లో వీటిని పడేస్తే.. తమ సిబ్బంది వచ్చి తీసుకెళ్తారని చెప్పారు. అధికారులు డా.లోకేష్, రమణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రమాదంలో మృతి చెందిన రాజశేఖరరెడ్డి

శాంతిపురం: కుప్పం– పలమనేరు జాతీయ రహదారి గుండిశెట్టిపల్లి వద్ద రోడ్డుపై పడిన మోటార్ సైక్లిస్టును గుర్తుతెలియని టెంపో తొక్కుకుంటూ వెళ్లింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మండల కేంద్రమైన రామకుప్పానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి గత 15 ఏళ్లుగా శాంతిపురంలో ఆర్‌కే ఫొటో స్టుడియో, జిరాక్సు సెంటర్ నిర్వహిస్తున్నాడు. రోజూ ఉదయం రామకుప్పం నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చి, సాయంత్రం తిరిగి వెళ్లేవాడు. ఈ క్రమంలో శనివారం తన స్టుడియోలో ఆలస్యం కావడంతో రాత్రి తన బైకుపై ఇంటికి పయనమయ్యాడు. మార్గమధ్యంలో గుండిశెట్టిపల్లి సమీపంలోని హంద్రి–నీవా కాలువ వద్ద బైకుకు అడ్డుగా వచ్చిన వ్యక్తిని ఢీకుని రోడ్డుపై పడిపోయాడు. వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తుతెలియని టెంపో తనపై నుంచి వెళ్లడంతో తలకు తీవ్ర గాయాలైన రాజశేఖర్‌రెడ్డి(34) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కుప్పం ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. సౌమ్యుడిగా పేరు తెచ్చుకున్న రాజశేఖర్ హఠాన్మరణం బంధువులతో పాటు పరిచయం ఉన్న వారిని కంటతడి పెట్టించింది. మృతుడికి భార్య, చిన్నారులైన ఇద్దరు కొడుకులు ఉన్నారు.

సత్యప్రమాణకంగా పోయిన నగలు దొరికాయి!

- రెండు వేర్వేరు ఘటనల్లో నగలు, నగదు చోరీ
- రాజనాలబండ మహిమతో లభ్యమైన వైనం



నగలు, నగదును అందుకుంటున్న ప్రసాద్ దంపతులు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

చౌడేపల్లె: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాల బండ ప్రసన్నాంజనేయ స్వామి మహిమతోనే వేర్వేరు ఘటనల్లో చోరీ అయిన సుమారు 40 గ్రాముల బంగారు నగలు, నగదు తిరిగి లభ్యమైనట్టు బాధితులు ప్రసాద్, గంగాదేవి తెలిపారు. శనివారం రాజనాలబండకు చేరుకొని స్వామివారి పాదాల చెంత నగలు, నగదును పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. వారి కథనం.. సోమల మండలం, పెద్ద ఉప్పరపల్లె సమీపంలోని బోనమందకు చెందిన ప్రసాద్ ఇంట్లో నెల రోజుల క్రితం చోరీ జరిగింది. ఇంట్లో తెలిసిన వ్యక్తులు బీరువాలోని నగలు 25 గ్రాములు, నగదు రూ.5 వేలు చోరీచేశారు. గుర్తించిన ప్రసాద్ ఇంట్లో వారిని, చుట్టుపక్కల వారిని విచారించారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెద్ద మనుషుల చేత పంచాయితీ నిర్వహించారు. రాజనాల బండలో ప్రమాణం చేయాలని తీర్మానించారు. గత శనివారం రాజనాలబండకు చేరుకొని ముందుగానే ఈ నెల 19వ తేదీ శనివారం ప్రమాణం చేయడానికి కావాల్సిన ఏర్పాట్లు పూర్తిచేశారు. శనివారం ఉదయం ఇంటికొక మనిషి రాజనాలబండకు ప్రమాణం చేయడానికి బయలు దేరాల్సి ఉంది. ఇంతలో ఇంటి ఆవరణలో నగలు, నగదు ప్రత్యక్షమయ్యాయి. గుర్తించిన బాధితులు పెద్ద మనుషులకు నగల విషయాన్ని తెలిపి కుటుంబ సభ్యులతో కలిసి ఆలయం వద్దకు చేరుకొని పూజలు చేశారు. అదేవిధంగా అన్నమయ్య జిల్లా, మదనపల్లె మండలం, దిగువకృష్ణాపురం వలసపల్లెకు చెందిన గంగాదేవి ఇంట్లో సుమారు 15 గ్రాముల బొట్టుచైను రెండు వారాల క్రితం చోరీకి గురైంది. గుర్తించి ఆమె ఇంట్లో, చుట్టుపక్కల విచారణ చేపట్టింది. రాజనాల బండకు చేరుకొని ఇంటికొక మనిషి సత్యప్రమాణం చేయాలని తీర్మానించగా ఉదయాన్నే ఇంటి గుమ్మం వద్ద బొట్టు చైను ప్రత్యక్షమైంది. దీంతో ఇరు కుటుంబాల వారు స్వామివారి చెంతకు నగలను తెచ్చి పూజలు చేశారు. స్వామి మహిమతోనే పోయిన నగలు తిరిగి వచ్చాయని సంతోషం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై మూకుమ్మడి దాడి



గాయపడిన ఆర్టీసీ డ్రైవర్ దినేష్‌కుమార్

పలమనేరు: పుగనూరు డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ దినేష్‌కుమార్(36)పై బైరెడ్డిపల్లి మండలం పీసీగుంటకు చెందిన ఏడుగురు యువకులు దాడికి పాల్పడిన ఘటన శనివారం గంగవరం మండలంలోని పత్తికొండ వద్ద చోటుచేసుకుంది. శనివారం డ్యూటీ దిగి ఇంటికి బైక్‌పై వస్తున్న బాధితునిపై ఏడుగురు యువకులు వెంబడించి మూకుమ్మడిగా దాడిచేసి గాయపరిచారు. దీంతో బాధితుడు చికిత్స కోసం పలమనేరు ఆస్పత్రికి వచ్చాడు. గంగవరం పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. తాను బైరెడ్డిపల్లి– పుంగనూరు సర్వీసుకు వారంలో రెండు రోజులు డ్రైవర్‌గా వెళతానని, ఆ వ్యక్తులు తనపై ఎందుకు దాడి చేశారో తెలియడం లేదని బాధితుడు తెలిపారు.

22న ప్రపంచ మామిడి దినోత్సవం

పలమనేరు: జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఈనెల 22న ప్రపంచ మామిడి దినోత్సవాన్ని నిర్వహించనున్నట్టు మామిడి రైతుల సంఘ నాయకులు మునీశ్వర్‌రెడ్డి తెలిపారు. సహకార రంగంలో పల్ప్ పరిశ్రమల ఏర్పాటు, మామిడికి గిట్టుబాటు ధర, వ్యాపారుల సిండికేట్‌పై ఇందులో ప్రధానంగా చర్చించనున్నట్టు తెలిపారు.

రైతుపై దాడి



శ్రీరంగరాజపురం : పొలం వద్ద పనిచేసుకుంటున్న ఓ రైతుపై నలుగురు వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ ఘటన శనివారం మండలంలో కలకలం రేపింది. బాధితుడి భార్య మోనిషా కథనం .. మండలంలోని పిల్లారికుప్పం గ్రామానికి చెందిన మునస్వామికి తన భర్త జగన్నాథంకు మధ్య భూ సమస్యలు ఉన్నాయి. ఈ విషయం కోర్టుదాకా వెళ్లింది. తీరా కోర్టు జన్నాథంకు అనుకూలంగా తీర్పునిచ్చింది. దీన్ని జీర్ణించుకోలేని మునస్వామి కుటుంబ సభ్యులు యుగంధర్, షణ్ముగం, అరుణాచలం, ధనశేఖర్ కలిసి అకారణంగా జగన్నాథంపై దాడి చేసి గాయపరిచారు. స్థానికులు అతన్ని 108 సాయంతో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

అమృతాన్ని కురిపించిన అమ్మతనం



జాతులు వేరైనా అమ్మతనం ఒక్కటేనని నిరూపించాయి వీ.కోటలో శునకం, లేగ దూడ. ఆకలితో అలమటిస్తున్న లేగదూడకు ఓ శునకం పాలిచ్చి అమ్మతనాన్ని పంచడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. వివరాలు.. మండలంలోని గోనుమాకులపల్లికి చెందిన అంబరీష్ తన ఇంటి వద్ద పాడి పశువులతో పాటు ఓ శునకాన్ని పెంచుకుంటున్నారు. ఈ మధ్యనే ఆ శునకం ఈనింది. తన పిల్లలతో పాటు అక్కడే ఉంటోంది. లేగదూడ కూడా వాటి వద్దే తిరుగుతుంటుంది. లేగదూడకు ఆకలేసినప్పుడు ఆ శునకం తన పాలు తాపించి ఆకలి తీర్చుతూ ఉంటుందని యాజమాని తెలిపాడు. ఈ దృశ్యాన్ని స్థానికులు ఆసక్తికరంగా చూస్తుంటారని చెప్పాడు. - వి.కోట